క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్‌ తీగలు



బాన్సువాడ రూరల్‌ : మండలంలోని బోర్లం క్యాంప్‌ రేణుక ఎల్లమ్మ డబుల్‌బెడ్‌రూం కాలనీలో విద్యుత్‌ తీగలు ప్రమాదకరంగా కిందికి వేళాడుతున్నాయి. విద్యుత్‌ తీగలు డబుల్‌బెడ్‌రూం ఇంటి లబ్ధిదారుడు వడ్ల ఆంజనేయులు ఇంటి ముందు నుంచి వేళాడుతూ వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

బీదర్‌కు తరలిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు తరలి వెళ్లారు. బీదర్‌లో ఉన్న విమానాశ్రమం, లక్ష్మీనరసింహా టెంపుల్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. మండలం నుంచి సుమారు 300 మంది నాయకులు ప్రైవేట్‌ సర్వీస్‌లలో తరలివెళ్లారు.

కల్కినగర్‌ అభివృద్ధి కమిటీ కార్యవర్గం



కామారెడ్డి రూరల్‌ : కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని లింగాపూర్‌ గ్రామ పరిధిలో కల్కినగర్‌ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పోతరాజు వెంకటేష్‌, ఉపాధ్యక్షులుగా నిట్టు రఘు, టిఎస్‌ చారీ, ఏనుగు నరేందర్‌రెడ్డి, కాసర్ల లక్ష్మణ్‌, ప్రధాన కార్యదర్శిగా బాజా లలిత జాయింట్‌ సెక్రటరీలుగా ఆకుల సుధాకర్‌, బి రమేష్‌, మోహన్‌గౌడ్‌, ఎల్లంకి సంతోష్‌, కోశాధికారిగా మనోజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

ఉద్యోగి జీవితంలో పదవీవిరమణ తప్పనిసరి



బాన్సువాడ : ఉద్యోగి జీవితంలో పదవీరమణ తప్పనిసరని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొయ్యగుట్ట ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న బాల్‌రాజ్‌ అనే హెచ్‌ఎం పదవీరమణ కార్యక్రమానికి సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాల్‌రాజ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ జంగం గంగాధర్‌, ఎంఈవో నాగేశ్వర్‌రావు, నాయకులు పిట్ల శ్రీధర్‌, మోహన్‌నాయక్‌ తదితరులున్నారు.

15వ వార్డులో బోరు మోటారు ప్రారంభం



కామారెడ్డి టౌన్‌ : మున్సిపల్‌ పరిధిలోని 15వ వార్డు అశోక్‌నగర్‌ కాలనీలో నూతన బోరు మోటారును మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గడ్డం ఇందుప్రియ ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌ వనిత, నాయకులు రాంమోహన్‌, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ ఆత్మీయ సమ్మేళనం



పిట్లం(జుక్కల్‌) : మండల కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో ఆదివారం పిట్లం లారీ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనం ముఖ్యఅతిథిగా జిల్లా ప్యాడి ఎగుమతుల గుత్తేదారు చిన్న పాల్గొన్నారు. ఆయనను లారీ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో అసోసియేషన్‌ సభ్యుడు అ యిన జబ్బార్‌ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులకు లారీ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ తరఫున రూ. లక్ష చెక్కును అందజేశారు. కాంగ్రెస్‌ నాయకులు మోహన్‌రెడ్డి, షేక్‌ నజీర్‌ తదితరులున్నారు.

ఆస్పత్రికి సుస్తీ..

- హన్మాజీపేట్‌ పీహెచ్‌సీని వేధిస్తున్న సిబ్బంది కొరత
- 10నెలలుగా వైద్యాధికారి పోస్టు ఖాళీ
- ఇబ్బందులు పడుతున్న రోగులు

బాన్సువాడ రూరల్‌ : మండల కేంద్రానికి సుమారు 20కి.మీ దూరంలో ఉన్న హన్మాజీపేట్‌ గ్రామానికి పీహెచ్‌సీలో ఎలాంటి సౌకర్యాల్లేవు. దీంతో గట్టుమీది గ్రామాలు, అనుబంధ తండాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. మారుమూల ప్రాంతం కావడంతో వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహించడానికి వెనుకడుగు వేస్తున్నారు. మెడికల్‌ ఆఫీసర్‌గా పనిచేసిన శ్రావణ్‌రెడ్డి బదిలీపై వెళ్లిపోవడంతో గతేడాది డిసెంబర్‌ నుంచి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో వైద్య సేవలపై పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోంది.

సగం పోస్టులు ఖాళీ..

ఆస్పత్రికి గుండెకాయ లాంటి వైద్యాధికారి పోస్టు 10 నెలలుగా ఖాళీగా ఉంది. అలాగే ల్యాబ్‌ టెక్నీషియన్‌, అసిస్టెంట్‌ పారా మెడికల్‌ ఆఫీసర్‌, ఎంపీ హెచ్‌ఈవో, ఎంపీహెచ్‌ఎస్‌ (మేల్‌) 2పోస్టులు, ఫిమేల్‌ 1పోస్టుతో పాటు 3 స్టాఫ్‌ నర్సుపోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీలో 22 పోస్టులకు 12 మంది స్టాఫ్‌ మాత్రమే అందుబాటులో ఉన్నారు. సీనియర్‌ అసిస్టెంట్‌ ఉన్నా అతనికి అదనంగా పెద్దకొడప్‌గల్‌, జుక్కల్‌ పీహెచ్‌సీలకు ఇన్‌చార్జిగా నియమించడంతో ఎటూ న్యాయం చేయలేకపోతున్నారు.

ప్రైవేట్‌ ఆస్పత్రుల వైపే..

ఇటీవల ఆర్నెళ్లుగా గట్టుమీది గ్రామాల ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. చికున్‌గున్యా, డెంగీ బారినపడి గ్రామస్తులు నేటికి పూర్తి స్థాయిలో కోలుకోలేదు. హన్మాజీపేట్‌తో పాటు కాద్లాపూర్‌, సంగోజీపేట్‌, కోనాపూర్‌, పైడిమల్‌ తదితర గ్రామాలు, అనుబంధ తండాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా పీఎంపీల వద్దకే పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే 20 నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న బాన్సువాడకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామంలోనే ఆస్పత్రి ఉన్నా 24 గంటల పాటు అందుబాటులో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో వైద్యాధికారి లేకపోవడంతో కొన్నేళ్లుగా ప్రసవాలు నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రిలో మెడికల్‌ ఆఫీసర్‌తో పాటు అన్ని పోస్టులను భర్తీచేసి గట్టుమీది గ్రామాల ప్రజలకు ప్రభుత్వ ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



హన్మాజీపేట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సేవలందించాలి



హన్మాజీపేట్‌ పీహెచ్‌సీలో వైద్యుడితో పాటు ఇతర ఖాళీల విషయంలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌కలెక్టర్‌ కిరణ్మయి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆస్పత్రిలో రెగ్యులర్‌ వైద్యుడితో పాటు పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

– సాయిబాబా, బీఆర్‌ఎస్‌ నాయకుడు

రోడ్డుపైనే పారుతున్న మురుగు



గోపాల్‌పేటలో ప్రధాన రహదారిపై మురుగునీరు



బిచ్కుందలోని ఎస్‌బీఐ ఎదుట..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో ప్రధాన రహదారిపై మురుగునీరు పారుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నుంచి పోచారం ప్రధాన కాలువ వరకు ప్రధాన రహదారి వెంట మురుగునీరు ప్రవహిస్తూ తీవ్రదుర్గంధం వస్తోంది. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కూల్చేసిన చెట్లు, కూలగొట్టిన దుకాణ సముదాయాల కారణంగా ఇదివరకు ఉన్న కచ్చా డ్రైనేజీ కొంతభాగం ధ్వంసమయింది. దీంతో మురుగునీరు కాలువ నుండి వయటకు ప్రవహిస్తూ ప్రధాన రహదారి వెంట పారుతుంది. అధికారులు స్పందించి ప్రధాన రహదారి వెంట పారుతున్న మురుగునీటిని మురికాలువలోకి మళ్లించాలని స్థానికులు కోరుతున్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్‌) : మండల కేంద్రంలో పంచాయతీ, ప్రత్యేక అధికారులు సమస్యలపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో మురికి నీరు రోడ్డుపై వరదలా ప్రవహిస్తుంది. బిచ్కుంద, బాన్సువాడ రోడ్డుపై అలాగే అంబేడ్కర్‌ చౌరస్తా నుంచి కమ్మరి చెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో రోడ్లపైనే మురికినీరు పారుతోంది. ఎస్‌బీఐ బ్యాంక్‌, రాజుల్లా చౌరస్తా, అంబేడ్కర్‌ చౌరస్తా, మౌలాలీ పీర్లు (గుర్రం) దగ్గర ఆయా ప్రాంతాలో రోడ్డు పై గుంతలు ఏర్పడి మురికి నీరు నిలువ ఉంటున్నాయి.

రక్తదాన శిబిరానికి స్పందన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పొల్కంపేటలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గామాతా ఉత్సవ కమిటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మండల శాఖ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్‌ తెలిపారు. 35 యునిట్ల రక్తం సేకరించినట్లు వారు తెలిపారు. రామానుజాచారి, దివిటి రమేశ్‌, సంజీవరెడ్డి, సత్యం, రమేశ్‌, నాగరాజు తదితరులున్నారు.

మార్కెట్‌ కమిటీ చైర్మన్‌కు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎల్లారెడ్డి మార్కెట్‌ కమిటీ సభ్యులను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మార్కెట కమిటీ చైర్మన్‌ రజిత, వైస్‌ చైర్మన్‌ జొన్నల రాజు, డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్‌, దశరథ్‌, వెంకట్రాంరెడ్డి, ప్రసాద్‌గౌడ్‌ తదితరులున్నారు.

భారతీయ కిసాన్‌ సంఘ్‌ కమిటీలు



ఎన్నికైన అయ్యపల్లి కిసాన్‌ సంఘ్‌ కార్యవర్గం



మాచారెడ్డిలోని చుక్కాపూర్‌ కిసాన్‌ సంఘ్‌ కార్యవర్గం

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయ్యపల్లి, శెట్పల్లి గ్రామాల్లో ఆదివారం భారతీయ కిసాన్‌ సంఘ్‌ గ్రామ కమిటీలు ఎన్నుకున్నట్లు జిల్లా నాయకుడు, విద్యుత్‌ వినియోగదారుల ఫోరం సభ్యుడు రాజాగౌడ్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరంగల్‌ రైతు డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. ఇందుకోసం అక్టోబర్‌ 5వ తేదీన ఛలో కామారెడ్డి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : కిసాన్‌ సంఘ్‌ చుక్కాపూర్‌ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నెల్‌ గారి అంజల్‌ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగి నర్సింలు, కార్యదర్శిగా గడ్డం నరసింహారెడ్డి, కోశాధికారిగా మహేందర్‌ రెడ్డి, సలహాదారులుగా నాగిరెడ్డి, సంజీవరెడ్డి, రాజనర్సింలు, చిన్న గంగయ్య, రాజిరెడ్డి, సంతోష్‌ రెడ్డిని ఎన్నుకున్నారు.

నిరుపయోగంగా వాటర్‌ ట్యాంకు



బాన్సువాడ రూరల్‌ : మండలంలోని కొత్తాబాది గ్రామంలో గ్రామస్తుల తాగు నీటి అవసరాల నిమిత్తం మంచి నీటి ట్యాంకును నిర్మించారు. నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాదిన్నర కాలం పూర్తి కావస్తున్నా నేటికి పైప్‌లైన్‌ కనెక్షన్‌ ఇవ్వలేదు. దీంతో అలంకార ప్రాయంగా మారింది. అధికారులు స్పందించి మిషన్‌ భగీరథ నీటిని ట్యాంకులోకి ఎక్కించి పైప్‌లైనింగ్‌ ద్వారా గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాడ్వాయి-దేవాయిపల్లి రోడ్డును బాగుచేయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైన రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం వేసిన బీడీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రోడ్డులో అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై తాడ్వాయి, దేవాయిపల్లి, బ్రాహ్మణపల్లి, కాలోజివాడి, టెక్రియాల్‌ గ్రామాలకు చెందిన ప్రజలు వెళ్తుంటారు. రాత్రి వేళలో ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు.

ముస్తాబవుతున్న దుర్గామాత మండపాలు



కామారెడ్డి రూరల్‌ : శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత మండపాలను ముస్తాబు చేస్తున్నారు. అక్టోబర్‌ నెల 3 నుంచి 9 రోజుల పాటు నిర్వహించే శరన్నవరాత్రులకు గ్రామాల్లో కూడా పట్టణాలతో పోటీ పడి భారీ సెట్టింగులు వేస్తున్నారు. దేవునిపల్లి, టేక్రియాల్‌, గర్గుల్‌, చిన్నమల్లారెడ్డి, నర్సన్నపల్లి, క్యాసంపల్లి, లింగాపూర్‌ తదితర గ్రామాల్లో సెట్టింగులు వేస్తున్నారు.

వైభవంగా బాలాజీ జెండా ఊరేగింపు



మద్నూర్‌(జుక్కల్‌) : మండల కేంద్రంలో 11 రోజులుగా కొలువుదీరిన తిరుమల తిరుపతి శ్రీవారి బాలాజీ జెండాకు ఆదివారం భక్తులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. జెండాను మండల కేంద్రంలో ఊరేగించారు. అనంతరం బాలాజీ జెండాకు భక్తులు వీడ్కోలు పలికారు. ప్రతి ఏడాది బాలాజీ జెండా 11 రోజుల పాటు ప్రతిష్ఠించిన అనంతరం కోడిచిరలో ఐదు రోజుల పాటు కొలువుదీరుతుందని జెండా బాలాజీ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి తిరుమలకు జెండా తరలి వెళ్తుందన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు గురుకుల విద్యార్థిని ఎంపిక



బాన్సువాడ రూరల్‌ : మండలంలోని బోర్లం క్యాంప్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎస్‌జీఎఫ్‌ అండర్‌–14 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్‌ శైలజ, పీఈటీ సుప్రియ తెలిపారు. మంచిప్పలోని జెడ్పీహైస్కూల్‌లో జరిగిన కామారెడ్డి, నిజామాబాద్‌ జిల్లాల రెజ్లింగ్‌ పోటీలో ప్రణీత గోల్డ్‌మెడల్‌ సాధించి స్టేట్‌ లెవెల్‌కు ఎంపికైందన్నారు. ప్రణీతను ప్రిన్సిపల్‌ శైలజతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలి



నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

కామారెడ్డి క్రైం : ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ ఇచ్చిన హామీల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌, ఇతర బీసీ డిక్లరేషన్‌ హామీలను అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలో విద్యానగర్‌ కాలనీలో బీసీ కుల సంఘాల రౌండ్‌ టేబుల్‌ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో 36 కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీల హక్కులు, స్థానిక సంస్థల రిజర్వేషన్‌లు, కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం వాటా అమలు చేయాలని, సమగ్ర కుల గణన చేపట్టాలని, బీసీల వాటా తేలిన తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల జేఏసీ జిల్లా నాయకుడు అర్కల ప్రభాకర్‌ యాదవ్‌ డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా నాయకులు పరశురామ్‌ యాదవ్‌, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు విఠల్‌, నాయకులు చిరంజీవి, రాజేందర్‌, నర్సింలు, రజినీకాంత్‌, ఎల్లన్న, సుధాకర్‌, మహేష్‌, నాగరాజు, సాయికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



భిక్కనూరు : తమతో చదువుకున్న స్నేహితుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో ఆ కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన కొజ్జ పురం పోచయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు 1999–2000 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ. 20వేలు పోచయ్య కుటుంబానికి అందజేశారు. ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులను, కిరాణ సామగ్రిని అందజేశారు. పోచయ్యకు ఇద్దరు కుమార్తెలకు, కుమారుడి చదువులకు అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ సత్తా చాటాలి



రాజంపేట : రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ సత్తా చాటాలని కాంగ్రెస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎర్ర ప్రణీత్‌ రెడి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలంలోని షేర్‌ శంకర్‌ తండా, కొండాపూర్‌ గ్రామల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌ మోహన్‌ ఆదేశాల మేరకు కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ కొండా హన్మడ్లు, డివిజన్‌ అధ్యక్షులు మదనలాల్‌, మండల సీనియర్‌ ఉపాధ్యక్షులు భీమరి శ్యామయ్య, ఉపాధ్యక్షులు మాశెట్టి శ్రీధర్‌, బన్సీలాల్‌, సెక్రటరీ సంజీవ రెడ్డి తదితరులున్నారు.

మూలమలుపుల్లో ముళ్ల పొదలు

- రోడ్లపై నిత్యం ప్రమాదాలు
- సూచిక బోర్డులు కూడా కరువు



బీబీపేట నుంచి ఉప్పర్‌పల్లి వెళ్లే రోడ్డులో మూలమలుపు

బీబీపేట: ప్రమాదకర మూలమలుపులు ఉండడం.. ఆపై రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ఉప్పర్‌పల్లి వెళ్లే రోడ్డు చెరువు కట్టపై నుంచి వెళ్తుంది. ఈ రోడ్డులో ప్రమాదకర మూలమలుపు ఉండడమే కాకుండా ముళ్ల పొదలు కూడా రోడ్డుపై వరకు పెరగడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అంతేకాకుండా చెరువు కట్ట ఉండడంతో వాహనదారులు భయంభయంగానే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మూలమలుపుల వద్ద కనీసం అధికారులు సూచిక బోర్డులు కూడా పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతే కాకుండా బీబీపేట నుంచి మల్కాపూర్‌ వెళ్లే రోడ్డులో కూడా పిచ్చిమొక్కలతో పాటు పలు చెట్ల కొమ్మలు రోడ్డుపై వరకు వచ్చాయి. దీంతో ఆ దారిలో రెండు భారీ వాహనాలు ఏవైనా వస్తే కిందికి దిగే అవకాశం కూడా లేకుండా పోయింది. బీబీపేట, ఉప్పర్‌పల్లి రోడ్డులో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ముళ్లపొదలు తొలగించడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలి

బాన్సువాడ : ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాల్‌రాజ్‌ అన్నారు. బాన్సువాడలో మెడిటేషన్‌పై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలని క్రమం తప్పకుండా ప్రతిరోజు మెడిటేషన్‌ చేయాలన్నారు. మెడిటేషన్‌పై శిక్షణ ఇస్తున్న మంత్రి శ్రీదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడిటేషన్‌ నిర్వాహకులు మంత్రి శ్రీదేవి, పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్‌, పద్మశ్రీనివాస్‌ ఉన్నారు.

సంక్షిప్తం

నేడు కిరాణా దుకాణం వేలం

రామారెడ్డి : ప్రముఖ పుణ్యక్షేత్రం కాలభైరవుడి ఆలయంలోని కిరాణ పూజ సామగ్రి దుకాణంను నేడు బహిరంగ వేలం నిర్వహించినట్లుగా ఆలయ ఈవో ప్రభు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ. 10 వేలు డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో కిరాణం దుకాణం దక్కించుకున్న వారు నవంబరు ఒకటి 2024 నుంచి 2026 అక్టోబర్‌ 31 వరకు కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

'మహిళలను మోసగిస్తున్న కాంగ్రెస్‌'

రాజంపేట : కాంగ్రెస్‌ ప్రభుత్వం మహిళలకు తీరని అన్యాయం చేస్తుందని రాజంపేట సొసైటీ వైస్‌చైర్మన్‌ ఆంద్యాల రమేశ్‌ ఓ ప్రకటనలో ఆరోపించారు. మహిళలకు నూతన పెన్షన్ల మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. బతుకమ్మ పండగను పురస్కరించుకుని మహిళలకు చీరల పంపిణీ విషయంపై ఊసెత్తకపోవడం సిగ్గు చేటన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పొల్యూషన్‌, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతామన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



రాజంపేట : రాజంపేట మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆదివారం కన్నుమూశారు. గ్రామానికి చెందిన కందారపు రాజవ్వ (105) మృతికి కాలనీవాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కందారపు రాజవ్వకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా ఆరుగురు మనుమళ, ముగ్గురు మనుమరాళ్లు ఉన్నట్లు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



బీబీపేట : మండలంలోని యాడారంలో బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీజేపీ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సభ్యత్వాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమార్‌గౌడ్‌, శ్రీనివాస్‌, రవీందర్‌, అల్లం ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్‌(జుక్కల్‌) : ప్రతి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మొగా గ్రామంలో గురువారం బీజేపీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ సంక్షేమ, అభివృద్ధి పనులపై ఆయన ప్రజలకు వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, నాయకులు అరుణ్‌ పటేల్‌ తదితరులున్నారు.